(గత సంచిక తరువాయి)

వశిష్ఠ, "నేను అలా చెయ్యాలంటే నువ్వు మా గ్రహం మీదకు రిలీజ్ చేసిన ఆ టైమ్ క్యాప్సూల్స్‌ను తిరిగి షిప్ లోకి వచ్చేలా చెయ్యాలి. అప్పుడే నేను నువ్వు చెప్పినట్టు చేస్తాను. లేదంటే నా ప్రాణం నేనే తీసుకుంటాను. ఇంతచేసి నీ ప్రేమను కాపాడుకోలేకపోతావు" అన్నాడు తెలివిగా.

అగస్త్య, "అయ్యో!! అది కుదరదు వశిష్ఠా.." అన్నాడు.

అసలు వశిష్ఠ, అగస్త్యతో బేరం ఎందుకు మాట్లాడుతున్నాడో తెలియక ద్రోణా, "వాడు అబద్ధం చెబుతున్నాడు వశిష్ఠా, క్యాప్సూల్స్‌ను కంట్రోల్ చేయడానికి వాడు సేపరేట్‌గా ఓ ప్రోగ్రాం ఇన్స్టాల్ చేశాడు. అది టైమ్ మెషీన్లో ఓ భాగం" అన్నాడు.

తలూపిన వశిష్ఠ, "నువ్వు నేను చెప్పినట్టు చేస్తేనే నేను నువ్వు చెప్పినట్టు చేస్తాను" అన్నాడు.

అగస్త్య, "ద్రోణా!! నువ్వు బ్రతికి ఉండటం నాకు తలపోటు తప్ప మరేం లేదు" అని గన్ ద్రోణా తలకు గురిపెట్టి, "యస్!! సేపరేట్ ప్రోగ్రాం ఉంది. కానీ, దానిని కంట్రోల్ చేసే ప్యానెల్ మొత్తం ఆరోజే పేలిపోయింది. అందువల్లనే కదా., నేను ఎక్కిన క్యాప్సూల్ వల్ల ఇలా కాలంలో ముందుకీ వెనక్కీ వెళ్తున్నాను. వాటిని నేను కంట్రోల్ చేయడం లేదు, వాటికంతటవే పనిచేస్తున్నాయి. నిజం చెప్పాలంటే నాకంటే బాగా పనిచేస్తున్నాయి. వాటిని ఆపడం మీ అబ్బతరం కూడా కాదు. మీ గ్రహం మనం అనుకున్న సమయం కంటే ముందే నాశనమవుతుంది. కానీ ఏం ఫర్వాలేదు. మళ్లీ కొత్తగా పుట్టుకొస్తుంది. ఈలోపు మనం రేఖను కాపాడేస్తాము. మళ్లీకాలం మీ గ్రహంలో యధాస్థానానికి వచ్చేస్తుంది సో., నామాట విని నాకోసం కాకుండా మీ గ్రహం కోసం పని చేయండి" అన్నాడు.

ద్రోణా, "వద్దు వశిష్ఠా!! వద్దు, నాకు నమ్మకం లేదు. మన రెండుగ్రహాల కాలమానాలు వేరు. ఇక్కడ నువ్వు చేసే పనులకు అక్కడ మార్పు వస్తుందంటే నేను నమ్మను. నామాట విను, మనం టైమ్ క్యాప్సూల్స్‌ను కంట్రోల్ చేయలేకపోవచ్చు గానీ, టైం మెషీన్ని ఆపవచ్చు. టైం మెషీన్‌లో రన్ అవుతున్న సీక్వెన్స్ ఆపితే, మొత్తానికి క్యాప్సూల్స్ నిర్వీర్యమవుతాయి. ఎందుకంటే అన్ని క్యాప్సూల్స్‌ను అల్టిమేట్‌గా టైం మెషీనే కంట్రోల్ చేస్తుంది" అన్నాడు.

వశిష్ఠ, 'ఇవన్నీ నాకు కూడా తెలుసు ద్రోణా,, నువ్వు కామ్‌గా ఉండు....' అని మనసులో అనుకుంటూ ఆర్యా వంక చూసాడు.

అగస్త్య, "అందుకు నేను ఒప్పుకోవాలి కదా..!! మధ్యలో దాని సీక్వెన్స్ ఆపితే టైమ్‌మెషీన్ దెబ్బతింటుంది. దాన్ని మళ్లీ బాగుచేయాలంటే కొన్ని సంవత్సరాలు పడుతుంది. కాబట్టి నోరు మూసుకుని నేను చెప్పినట్టు చేయండి" అన్నాడు.

ద్రోణాకు కోపం వచ్చింది. వెంటనే ఒక్క ఉదుటన పైకి లేచి ఎడమచేత్తో అగస్త్య చేతిలో ఉన్న గన్ పట్టుకుని, కుడిచేత్తో అతని పీక పట్టుకున్నాడు. వెంటనే వశిష్ఠ, అగస్త్య కాలిమీద గట్టిగా తన్నాడు. దెబ్బకు అగస్త్య ముందుకు పడ్డాడు. వెంటనే ఆర్యా తన వద్దనున్న స్టన్ గన్‌తో అగస్త్య పీకమీద షాక్ ఇచ్చాడు.

అగస్త్య పట్టు తప్పి గన్ వదిలేసాడు. వెంటనే వశిష్ఠ ఆ గన్ అందుకున్నాడు. అందరూ వశిష్ఠ వైపు వచ్చి నిలబడ్డారు.

వెంటనే వశిష్ఠ, "ద్రోణా!! నువ్వూ, భీష్మా వెళ్లి టైం మెషీన్ సీక్వెన్స్ ఆపండి. అలాగే, దాన్ని పీస్ పీస్ చేసేయండి. వీడి సంగతి నేను చూసుకుంటాను" అన్నాడు.

ఆర్యా, విరించిని తీసుకుని సేఫ్‌గా పక్కన నిలబడ్డాడు.

అగస్త్య పైకి లేచి నవ్వుతూ, "వశిష్ఠా!! నువ్వు టైమ్ మెషీన్ సీక్వెన్స్ ఆఫ్ చేయొచ్చు గానీ, మీ గ్రహాన్ని మాత్రం కాపాడలేవు. నేను మరలా ఇక్కడనుండి కాలంలోకి ఈడ్చుకెళ్లబడతాను. అప్పుడు తిరిగి ఇక్కడకు వస్తాను. మళ్లీ కథ ప్రారంభిస్తాను. నువ్వు నన్ను ఎన్నటికీ ఓడించలేవు" అన్నాడు.

ఆర్యా స్టన్ గన్‌తో ముందుకు వచ్చి, "ఈసారి నువ్వు ఎలా మాయమవుతావో చూస్తాను....." అని గన్ ఆన్ చేశాడు.

వశిష్ఠ, "మనకు స్టన్ గన్‌తో అవసరం లేదు ఆర్యా,, వీడు అనంతమైన కాలక్రమంలో వీడు కలిసిపోయే రోజు వచ్చింది. ఆ టైం మెషీన్ సీక్వెన్స్ ఆపితే దాని ప్రభావం వీడిమీద కూడా పడుతుంది. అదే మొత్తానికి ఆ టైమ్ మెషీనే లేకుండా చేస్తే వీడి పరిస్థితి ఏంటో ఆలోచించు" అన్నాడు.

అగస్త్య, వశిష్ఠకు అసలు రహస్యం తెలిసిందనే కోపంతో, దాడి చేయడానికి వచ్చాడు. అప్పటికే ఒక కాలిమీద కాల్చిన వశిష్ఠ రెండో కాలిమీద కూడా కాల్చాడు. అగస్త్య అమాంతం కిందపడ్డాడు.

అగస్త్య, "నేను ఏ కాలచక్రంలో పడినా మళ్లీ వస్తాను. మళ్లీ మళ్లీ వస్తాను. మీరు నన్ను ఆపలేరు" అని గట్టిగా నవ్వడం ఆరంభించాడు.

🦋🦋🦋

భీష్మా, ద్రోణా టైమ్ మెషీన్ వద్దకు చేరారు. భీష్మా టైం మెషీన్ చూసిన ఆనందంతో, "అతి గొప్ప ఆవిష్కరణను నాశనం చేస్తున్నాము" అన్నాడు.

ద్రోణా, "ఆవిష్కరణ గొప్పతనం, అది ఎంతమందికి మంచి చేస్తున్నదనే దానిమీద ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం దీనివల్ల నష్టం తప్ప లాభం లేదు. కాబట్టి, దీన్ని నాశనం చేయక తప్పదు" అంటూ వేగంగా కంట్రోల్ ప్యానెల్ మీద వేళ్ళను కదిలించి సీక్వెన్స్ ఆఫ్ చేశాడు.

"భీష్మా..! ఆ కింద టూల్‌బాక్స్‌లో హేమర్ ఉంటుంది, అందుకో...." అని టైం మెషీన్‌లో ఆపదకాలంలో వాడే సెల్ఫ్ డిస్ట్రక్షన్ మోడ్ ఆన్ చేసి, కంట్రోల్ ప్యానెల్ మొత్తాన్ని సుత్తి సహాయంతో నాశనం చేసాడు.

భీష్మకు అతని చర్య అర్థంకాక, "పదా.. పనైపోతే ఇక్కడనుండి పోదాం....." అన్నాడు.

"వచ్చినపని సెంట్ పర్సెంట్ కంప్లీట్.., పదా!!" అని వశిష్ఠ వద్దకు వచ్చి విషయం చెప్పా ద్రోణా.

వశిష్ఠ, "గుడ్!! మనం భూమిని చేరడానికి పాడ్ సిద్ధం చేయండి" అన్నాడు.

ద్రోణా, "మీరందరూ వెళ్లి పాడ్ ఎక్కండి. కొన్ని నిమిషాల్లో ఈ స్పేస్‌షిప్ పేలిపోతుంది. పాడ్ లాంచ్ నేను చేస్తాను" అన్నాడు.

వశిష్ఠ, "స్పేస్ షిప్ పేలిపోతుందా? అంటే యస్.డి.ఎం" అన్నాడు.

"యస్!!" అని పాడ్‌ను లాంచ్ కోసం సెటప్ చేయడం స్టార్ట్ చేసాడు ద్రోణా.

వశిష్ఠ, "నువ్వు కూడా మా గ్రహానికి వచ్చెయ్ ద్రోణా., మాతో కలసి హాయిగా జీవించు" అన్నాడు.

ద్రోణా, "వశిష్ఠా!! మా గ్రహవిస్ఫోటనమైతే దానికి చెందిన నేను కూడా గాల్లో కలసిపోతాను. నేను పూర్తిస్థాయిలో శాస్త్రవేత్తను కాకపోయినా ఆమాత్రం మినిమమ్ నాకు కూడా తెలుసు. నేను ఇక్కడే ఇలా చనిపోవడం ఇష్టం, కనీసం నా గ్రహం నుండి వచ్చిన షిప్‌లో ప్రాణాలు వదిలాననే తృప్తి నాకు మిగులుతుంది" అని భారమైన గొంతుతో అన్నాడు.

వశిష్ఠ అతని నిర్ణయాన్ని గౌరవించి,గట్టిగా గుండెలకు హత్తుకుని, "నువ్వు లేకుండా నేను ఇది సాధించేవాడ్ని కాదు ద్రోణా, ఎన్ని కాలగమనాలు మారినా నువ్వు నాకు గుర్తుంటావు" అన్నాడు.

ఒకరి తర్వాత మరొకరు ద్రోణాకు వీడ్కోలు పలికి భారమైన హృదయాలతో పాడ్ ఎక్కారు. పాడ్‌ను వెంటనే భూమ్మీదకు లాంచ్ చేశాడు ద్రోణా.

పాడ్ వేగంగా దూసుకెళ్లింది.

అగస్త్య, "ద్రోణా!! నమ్మకద్రోహి...." అన్నాడు.

ద్రోణా, "మనిషన్నవాడు ఏ గ్రహంలో ఉన్నా వాడికి మానవత్వం ఉండాలి. నేను మనిషిని" అని నవ్వుతూ అనంతమైన విశ్వం వైపు నవ్వుతూ చూశాడు.

పెద్ద శబ్దంతో స్పేస్ షిప్ ఒక్కసారిగా పేలింది.

దాని ప్రకంపనలకు భూమి వైపు ప్రయాణించే పాడ్ స్వల్పంగా గురైంది.

విషయం అర్థమైన వశిష్ఠ కళ్ళు తడిసాయి.

పాడ్ వేగంగా బెర్ముడా లోని ఓ తీరప్రాంతంలో ల్యాండ్ అయింది.

పాడ్ డోర్ ఓపెన్ అయ్యింది. అందరూ బయటకు దిగారు. ఆర్యాను, విరించిని వశిష్ఠ హాస్పిటల్లో చేర్పించాడు.

🦋🦋🦋

కొన్నిరోజులు గడిచాయి. మెల్లిగా నాన్ లీనియర్ జోన్స్ యొక్క ప్రభావం పూర్తిగా తగ్గింది. ఎక్కడా వాటి ఆనవాలు కూడా లేకుండా సాధారణ స్థితికి వచ్చింది భూగ్రహం.

ఆర్యా, విరించి పూర్తి ఆరోగ్యంతో డిశ్చార్జ్ అయ్యారు.

🦋🦋🦋

బెర్ముడాలోని వశిష్ఠ షిప్..,

షిప్ ముందు భాగంలో అందరూ భోజనానికి కూర్చున్నారు. అన్నింటిని స్వయంగా వశిష్ఠనే సిద్ధం చేశాడు.

వశిష్ఠ, "ఫ్రెండ్స్!! ఈరోజు మనం ఇక్కడ ఇంత హ్యాపీగా ఉన్నామంటే కారణం ద్రోణానే, అతడిని మనం చిరకాలం గుర్తు పెట్టుకోవాలి. అతని ఆత్మశాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటిద్దాం" అని కళ్ళు మూసుకున్నాడు.

మిగతావాళ్ళు కూడా కళ్ళు మూసుకున్నారు. వశిష్ఠ కళ్లెదుట వీడ్కోలు చెప్పిన ద్రోణా మొహం కనిపించింది.

రెండు నిమిషాలు పూర్తయ్యాయి.

కళ్ళు తుడుచుకుని, "విరించీ!! నీ ఫ్రెండ్ వంశీ, అలాగే నిన్ను కూడా నా దగ్గర రీసెర్చ్ అసోసియేట్‌గా తీసుకుంటున్నాను. దానికి రిలేటెడ్ డాక్యుమెంట్స్ సిద్ధం చేసి పంపిస్తాను. వంశీ టెక్ వల్లనే మనం అగస్త్యను ట్రాక్ చేశాము. ఇంకా ఆర్యా,, నీ ధైర్యం మనదేశానికే గర్వకారణం. ప్రొఫెసర్ మీరు లేకుండా కూడా ఈ విజయం సాధ్యపడదు" అని అందరి మీద తన అభిప్రాయాన్ని పంచుకున్నాడు వశిష్ఠ.

ఆర్యా, "వశిష్ఠా!! నాక్కొన్ని అనుమానాలున్నాయి. ఇది సందర్భం కాకపోవచ్చు గానీ తప్పడం లేదు. వాటిని నాకు కొంచెం క్లారిఫై చేస్తావా...??" అనడిగాడు.

"ఆర్యా!! నువ్వీ ప్రశ్న ఎప్పుడు అడుగుతావోనని చూస్తున్నాను. నీ అనుమానాలన్నీ నాకు తెలుసు. మనం భవిష్యత్ లోకి వెళ్ళినప్పుడు కొన్ని విషయాలు నాకు ముందే తెలిసినట్టు ప్రవర్తించాను, అవి నాకెలా తెలిసాయనే కదా నీ అనుమానం..!?" అనడిగాడు.

"అవును!!" అని తలాడించాడు ఆర్యా.

"అగస్త్యతో పోరాటం అనగానే నాకొచ్చిన ఆలోచన అతని టైం లూప్. అది అతనికి అడ్వాంటేజ్. దాన్ని వాడుకుని వాడు అక్కడనుండి వేరేచోటుకి, వేరే టైంలోకి వెళ్లిపోతాడు. మనం వాడ్ని పట్టుకోలేము. అది టైం లూప్ కావడం వల్ల వాడు ప్రతీసారి కాలంలో ముందుకీ వెనక్కీ ఈడ్చుకునిపోతాడు. మనం విడిగా వాడితో వెళ్లలేము కదా., అందుకే ఆరోజు పాడ్ వద్ద మిగిలిన వాళ్ళని వదలమని చెప్పాను కానీ ఆరోజు వర్షం వల్ల దాని ప్రభావం నీమీద కూడా పడింది. లేకపోతే నేనే ఒంటరిగా వాడితో వెళ్ళేవాడ్ని. ఆరోజు రాత్రి మీరందరూ బయట ఇక్కడ పడుకున్నప్పుడు అగస్త్య యొక్క టైం లూప్‌ను పూర్తిగా ఎనలైజ్ చేశాను. అప్పుడే నాకర్థమైంది. వాడు ఆ లూప్‌లో కొన్ని వందలసార్లు ముందుకీ వెనక్కీ వెళ్తూ ఒక్కసారైనా ఆ టైం మెషీన్ వద్దకు వెళ్తాడని అర్థమైంది. అందుకే నేను దీన్ని రెండోఛాన్స్ కింద పెట్టుకున్నాను. మీరు ఆరోజు పాడ్ మీద స్పేస్ షిప్ లోకి వెళ్ళినప్పుడు భద్రా చేతిలో మీరు ఓడిపోయారు. మన భూమ్మీద పూర్తిస్థాయిలో నాన్ లీనియర్ జోన్స్ వచ్చేశాయి. ఆ భవిష్యత్తులోకే నువ్వూ నేను అగస్త్యతో పాటు వెళ్ళాము. అగస్త్య అప్పటికే కొన్ని వందలసార్లు అక్కడకు వెళ్లి రావడం వల్ల అతనికి ఆ లూప్‌లో ఏమేమీ జరుగుతాయో ముందే తెలుసు. మనం అగస్త్యతో పాటు కాలంలో ఒక్కసారి కాదు, కొన్ని వందలసార్లు వెళ్లి వచ్చాము. నేను నాతో పాటు ఓ రికార్డర్ తెచ్చుకున్నాను. లూప్ లోకి వెళ్లిన ప్రతీసారి అదేన్నో లూపో లెక్కిస్తూ వచ్చాను. లూప్ లోకి రావడం భూ వినాశనం జరగడం జరిగింది. ఐతే, ఆ లూప్ చివరిస్థానం దాని మొదటి స్థానమే అవుతుందన్న విషయం అగస్త్య మర్చిపోయాడు. కాలానికి ఆది మాత్రమే ఉంటుంది అంతం కాదు. కానీ కాలంలో క్రియేట్ అయిన లూప్స్‌కి ఆది, అంతం రెండూ ఉంటాయి. కాకపోతే ఒక వృత్తానికి స్టార్టింగ్ పాయింట్, ఎండింగ్ పాయింట్ ఒకటే అయినట్టు లూప్‌కి కూడా సేమ్ అవుతుంది. నేను ఎక్జాక్ట్ ఆ పాయింట్ కోసం వేచి చూశాను. ఆ టైమ్ లూప్ జెనరేట్ అయ్యింది, భూమ్మీదనే అయినా దాని సోర్స్ అయిన టైం మెషీన్ స్పేస్ షిప్‌లో ఉండటం వల్ల మనం వాడితో పాటు అక్కడకు చేరిపోయాము. నేను ముందుగా రికార్డ్ చేసుకున్న రికార్డింగ్ విని, మరొక లూప్ లోకి రాగానే దాని ముందుకు రికార్డ్ విని దాన్ని డిలీట్ చేసేవాడిని. కారణం, మనకు లూప్‌లో జరిగిన విషయాలు గుర్తుండవు. అలాంటప్పుడు, నేను చివరి లూప్‌ను ఎలా గుర్తించగలను..? అందుకే ఒక లూప్ నుండి మరొక లూప్‌కి జంప్ అవుతూ ఒక్కో రికార్డింగ్ వింటూ ఒక్కో రికార్డ్ డిలీట్ చేస్తూ వచ్చాను. చివరికి అగస్త్యను ఓడించి మన గ్రహాన్ని కాపాడుకున్నాము" అని తను ప్రయోగించిన ప్రణాళికలను వివరించాడు.

భీష్మకు కూడా వశిష్ఠ చెప్పిన కొన్ని మాటలు అర్థం కాలేదు. ఆర్యా ఇంకా సందిగ్ధంలోనే ఉన్నాడు. విరించి మాత్రం వశిష్ఠ చెప్పిన మాటలు వినకుండా భోజనం మీద దృష్టిపెట్టాడు.

ఆర్యా, "ఏదైతేనేం మనం విజయం సాధించాము. ఈ విషయం బయట ప్రపంచానికి తెలియజేస్తావా..?" అనడిగాడు.

వశిష్ఠ, "నేను దీన్ని రహస్యంగా ఉంచుతాను. కానీ ఎవరికైతే దీని గురించి తెలియాలో వాళ్ళకి ఖచ్చితంగా చెబుతాను. రేపే మీరు ఇండియా వెళ్లబోతున్నారు. మీ అందరూ పాస్‌పోర్ట్ సిద్ధం చేసుకుని వుండండి. మనం భవిష్యత్తులో కలసి పని చేసే ఆవకాశం వస్తుంది" అన్నాడు.

భీష్మ, "వశిస్థా!! మరి ఆ టైం క్యాప్సూల్స్ పరిస్థితి ఏంటి?" అనడిగాడు.

"అవి టైం మెషీన్ పేలినప్పుడు ఏ కాలంలో ఉన్నాయో ఆకాలంలోనే భూమిని ఢీ కొంటాయి. కొన్ని భవిష్యత్తులో, మరికొన్ని గతంలో ఇలా.., గతంలో ఢీ కొట్టినవి మనోళ్లు కనిపెడితే ఈపాటికే ప్రపంచానికి తెలిసి ఉండాలి. భవిష్యత్తులో వచ్చేవి ఎలానో మనం చూస్తాం కదా....." అని సమాధానం చెప్పాడు వశిష్ఠ.

విరించి, "సర్!! మనం కలిసి పనిచేయబోయే ప్రాజెక్టు ఏంటి సర్..?" అనడిగాడు.

వశిష్ఠ నవ్వుతూ ఆకాశం వంక చూసి, "స్పేస్ ట్రావెలింగ్...." అన్నాడు.

అలా అందరూ కూర్చుని ఆరోజు భోజనం పూర్తిచేసి, అక్కడే విశ్రాంతి తీసుకున్నారు .

తర్వాతరోజు జెట్‌లో ఇండియా చేరారు.

విరించి తన స్నేహితుడితో వశిష్ఠ ఇచ్చిన మాట గురించి చెప్పాడు. వంశీ ఒక్కసారిగా ఎగిరి గంతేసాడు.

🦋🦋🦋

కొన్నిరోజుల తర్వాత..,

డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం,

న్యూఢిల్లీ..,

వశిష్ఠ కారిడార్‌లో ప్రెసిడెంట్ పిలుపు కోసం ఎదురుచూస్తున్నాడు. చేతికున్న వాచ్ వంక తదేకంగా చూస్తూ, ఆలోచనలో మునిగాడు.

అంతలో ఒకతను వచ్చి, "మిస్టర్ వశిస్థా!! రండి" అని పిలిచాడు.

అతనితో వెళ్లిన వశిష్ఠను ఓ కాన్ఫరెన్స్ రూం వద్దకు తీసుకువెళ్లి, మీటింగ్‌లో జాయిన్ అవమని చెప్పి అతను తలుపు బయటనే నిలబడ్డాడు.

వశిష్ఠ తలుపు తీసి లోపలకు వెళ్ళాడు. లోపల ఉన్న వాళ్ళందరూ వశిష్ఠ వంక చూశారు. వశిష్ఠ నేరుగా నడుచుకుంటూ వెళ్లి తన పేరున్న సీట్‌లో కూర్చున్నాడు. కొన్నిక్షణాలకు ప్రధానమంత్రి అమరేంద్ర మోదీ వచ్చి కూర్చున్నారు. ఆయనను చూసి గౌరవంగా అందరూ లేచి నిలబడ్డారు.

ఆయన అందర్నీ కూర్చోమని వశిష్ఠను చూపిస్తూ, "ఇతనే వశిష్ఠ, ఇండియన్ గవర్నమెంట్ నుండి నేను మీకు పంపిన రీసెర్చ్ డాక్యుమెంట్స్ ఇతనివే. వాటిని మీరు ఇప్పటికే రివ్యూ చేసి ఉంటారు. దానిలో ఎంత ప్రమాదం ఉన్నదో మీకే తెలుసు. ఆ భగవంతుడి దయవల్ల మొదటిసారి మనం తప్పించుకున్నాము. కానీ దానికి రెండింతల ప్రమాదం రాబోతుందని వశిష్ఠ అంచనా వేసాడు. ఇక్కడ యూ.యస్, కెనెడా, రష్యా, చైనా, జపాన్ వంటి దేశాల సైన్స్ అండ్ టెక్నాలజీ మినిస్ట్రీస్ ఉన్నారు. ఇది మనమందరం కలిసికట్టుగా చేయవలసిన పని. నేను వశిష్ఠను డైరెక్టర్‌గా నియమిస్తూ ఓ వింగ్‌ను ఏర్పాటు చేస్తున్నాను. దానిలో మీ దేశంలో అత్యుత్తమ శాస్త్రవేత్తల భాగస్వామ్యం కావాలి. ఆర్థికంగా ఎంత ఖర్చయిన భారత్ చూసుకుంటుంది. మన గ్రహాన్ని మనమే కాపాడుకోవాలి. మిగతా వివరాలు వశిష్ఠ చెబుతాడు" అని ఆయన ముగించాడు.

వశిష్ఠ, "మనగ్రహంలో ఒకసారి నాన్ లీనియర్ జోన్స్ ఏర్పడ్డాయి. వాటికి కారణమైన టైమ్ క్యాప్సూల్స్‌ను మేము నాశనం చేశాము. దానితో ఈ ప్రమాదం తప్పిందనుకున్నాను. కానీ కొన్నిరోజుల క్రితం నేను టైం ఎనలైజర్‌ను అప్‌గ్రేడ్ చేయడానికి ప్రయత్నం చేసినప్పుడు అసలైన ప్రమాదం తెలిసింది. నేను ఇంకా ఆ టైం లూప్ లోనే ఉన్నాను. ఆ టైం మెషీన్‌ను నాశనం చేస్తే అన్నీ సర్దుకుంటాయనుకున్నాను గానీ, అక్కడే అంచనా తప్పయింది. ఆరోజు ఆ యస్.డి.ఎం పేలాడానికంటే ముందు అగస్త్య అక్కడ నుండి మరొక కాలానికి లాక్కెళ్లబడ్డాడు. మేము వాస్తవానికి రావడం వల్ల అతనితో మాకున్న లింక్ తెగిపోయింది. ఆ అగస్త్య చనిపోలేదు. కాలంలో ఎక్కడో చిక్కుకునిపోయాడు. వాడు ఇప్పుడు ఎక్కడ ఏ కాలంలో ఉన్నాడో మనకు తెలియదు. వాడు మళ్లీ ఎప్పుడైనా తిరిగి రావచ్చు. అప్పుడు వాడ్ని ఎదురుకోవాలంటే నా ఒక్కడి శక్తి మాత్రమే సరిపోదు. మీ అందరి సహకారం కావాలి. వాడి గ్రహం పూర్తిగా నాశనమైంది. వాడి లక్ష్యం నెరవేరలేదు. వాడు ఖచ్చితంగా మళ్లీ భూమిని నాశనము చేయాలని చూస్తాడు. వాడు గానీ ఒక్కసారి వాడి నిజమైన కాలంలోకి వెళితే మాత్రం వాడ్ని మనం అపలేము. కారణం వాడికి కూడా నాలా అన్నీ తెలుసు. వాడ్ని ఎదుర్కోవడం కోసం మనం సిద్ధంగా ఉండాలి.

అందుకోసమే ఈ ప్రాజెక్ట్, 'ప్రహ్లాద్'....

దీనిలో మనం అత్యంత శక్తివంతమైన ఇంజన్స్ కలిగిన షిప్స్ సిద్ధం చేస్తున్నాము. ఈ షిప్స్ స్పేస్ ట్రావెలింగ్ కోసం వాడతాము. వీటి ద్వారా మనం మరో గ్రహానికి ప్రజలను ట్రాన్స్‌పోర్ట్ చేయాలి. నేను నా ఫ్రెండ్ ద్రోణా సహాయంతో అలాంటి గ్రహాన్ని చాలా రోజుల క్రితమే గుర్తించాను. అక్కడ మనకు అన్ని రకాల సోర్సెస్ ఉన్నాయి. దీనిలో ఉన్న అన్ని కాంప్లికేషన్స్ నాకు తెలుసు. అన్నింటికి నావద్ద సమాధానాలు ఉన్నాయి. దీనికి మీ అందరూ ఒప్పుకుని తీరాలి. అగస్త్య టైం లూప్ మన గ్రహానికి మాత్రమే కనెక్ట్ అయ్యుంది. కాబట్టి ఈ గ్రహం విడిచి వెళ్లడం తప్ప మనకు మరో మార్గంలేదు" అని తన వివరణ ఇచ్చి కూర్చున్నాడు.

అందరూ తెల్లమోహలు వేసి చూశారు.

కొన్ని గంటల చర్చల తర్వాత అందరూ తమ మద్దతు తెలుపుతూ సంతకాలు పెట్టి వెళ్లిపోయారు.

వశిష్ఠ, "సర్!! మీరు నా మీద నమ్మకం పెట్టి, నాకు సపోర్ట్‌గా ఉండటం వల్లనే భూమిని కాపాడాను" అని తనకు అన్ని విధాలుగా సహకరించిన ప్రధాని అమరేంద్రమోదీకి ధన్యవాదాలు తెలుపుకుని, ఆయన దగ్గర సెలవు తీసుకుని బయటకు వచ్చేసాడు.

వశిష్ఠ తన కారు డోర్ తీస్తూ దూరంగా కమ్ముకుంటున్న మేఘాల వంక చూస్తూ, "ఎన్ని లక్షల, కోట్లసార్లు ప్రయత్నం చేసినా నా గ్రహాన్ని నువ్వేం చేయలేవు అగస్త్యా....." అనుకుంటూ కారెక్కాడు.

🦋🦋🦋

జురాసిక్ కాలం.,

తెలియని ప్రదేశం....,

అగస్త్య కాళ్ళ చుట్టూ చిన్నచిన్న వింత జీవులు, అతని శరీరం నుంచి కారిన రక్తాన్ని నాకుతూ ఉన్నాయి. అగస్త్య మెల్లిగా కళ్ళు తెరిచాడు. ఎదురుగా ఉన్న వింతజీవులను చూసి భయంతో కేకలు వేసి, పక్కనే ఉన్న బండను తీసుకుని దానితో వాటిని చిదిమి చిదిమి చంపి పైకి లేచి, "నీ కోసం తప్పకుండా తిరిగి వస్తాను వశిస్థా....!!" అంటూ ఆకాశం వైపు చూస్తూ గట్టిగా అరిచాడు.

★★మళ్ళీ ఆరంభం★★

(సమాప్తం)

COMMENTS